సాక్షి నంద్యాల

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



అక్షర రూపంలో అభినందన

మంత్రాలయం రూరల్: మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్‌–3, ఇండియా అక్షర రూపంలో కూర్చొని ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



మెలకువలే విజయ సోపానాలు

ఎస్‌ఐ ఉద్యోగార్థులకు శుక్రవారం నుంచి దేహ దారుఢ్య పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మెలకువలు పాటించాలని నిపుణులు, శిక్షకులు సూచిస్తున్నారు. IIలో



విష్ణు.. ఇదేమి చోద్యం!

చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని ఇటీవలే గగ్గోలు పెట్టిన టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి గార్గేయపురం చెరువును ఆక్రమించుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. IIలో

న్యూస్‌రీల్‌

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నారు. స్థానిక చంద్రవతి కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ వ్రతంలో 750 మంది సాధారణ భక్తులు, మరో 250 మంది తెల్లరేషన్‌ కార్డు కలిగిన ముత్తైదువులు మొత్తం 1000 మంది పాల్గొననున్నారు. పూజా సామగ్రి మొత్తం దేవస్థానమే సమకూర్చనుంది. ఈ వ్రతంలో పాల్గొనే వారికి అమ్మవారి శేషవస్త్రాలు, జాకెట్‌ పీస్‌, పూలు, గాజులు, ప్రసాదం అందిస్తారు. వ్రతాచరణకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాన్ని ధరింపజేస్తారు. వ్రతానంతరం శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్‌): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని గురువారం డీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్‌, మండల పరిషత్‌, ఐటీడీఏ, మున్సిపల్‌ స్కూల్స్‌, రెసిడెన్షియల్‌, ఎయిడెడ్‌ పాఠశాల్లో పదేళ్లగా పని చేస్తున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఎలాంటి నేరారోపణలు, అభియోగాలు లేని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోపు డిప్యూటీ డీఈఓ, ఎంఈఓల ద్వారా పంపాలన్నారు. గతంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారు అర్హులు కాదన్నారు. డిప్యూటీ, మండల విద్యాధికారులు కమిటీలు ఏర్పాటు చేసుకొని కేటగిరీ వారీగా ఒక ఉపాధ్యాయున్ని ఎంపిక చేసి, ప్రతిపాదనలను కమిటీ సభ్యులచే ధృవీకరించి (పది వాక్యాలకు మించకుండా) డీఈఓ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు.

3.22 లక్షల ఎకరాల్లో పంటల సాగు



ఈ పంట నమోదు వివరాలు తెలుసుకున్న డీఏఓ మోహన్‌రావు

నంద్యాల(అర్బన్‌): జిల్లాలో ఖరీఫ్‌ కింద 5.89 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 3.22 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ఈ – పంట నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు వర్తిస్తాయన్నారు. మండలంలోని కానాల గ్రామంలో గురువారం ఏఓ ప్రసాదరావు, ఈ పంట సాంకేతి సహాయకులు అయూబ్‌బాషాలతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఈ క్రాప్‌ గురించి వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ కౌలు దారుల పేరు మీద, నీటి వనరుల ఆధారంపై వీఏఏలు పంట నమోదు చేయాలన్నారు. ఈ పంట నమోదులో ఏవైనా సమస్యలు తలెత్తితే జిల్లా కార్యాలయానికి తెలియజేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిమోహన్‌రెడ్డి, వీఏఏ పుష్పలత పాల్గొన్నారు.



కర్నూలు మండలం నందనపల్లి సచివాలయంలో సేవలు అందిస్తున్న ఉద్యోగులు

వేతనం పెరిగి.. వెలుగులు నిండి

ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా

వేతనాలు పెంచి సచివాలయ ఉద్యోగుల జీవితాల్లో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రజలకు పాలన చేరువ చేశారు. లక్షలాది మంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించారు. ఈ ఉద్యోగాలు పొందిన వారు శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం తొలి ఇంక్రిమెంట్‌, డీఏ పెంపుతో జీతాలను పెంచింది. పెరిగిన జీతాలను అందుకున్న సచివాలయ ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగులకు పెరిగిన పే స్కేల్‌
- తొలి ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏ అందుకున్న ఉద్యోగులు
- జిల్లా కేంద్రానికి సమీపంలోని వారికి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తింపు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,999 మందికి ప్రయోజనం

కర్నూలు(అర్బన్‌)/కొలిమిగుండ్ల: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తి అయిన వారికి ఎలాంటి జాప్యం చేయకుండా ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏ కలిపి జూలై నెల జీతాన్ని ఈ నెలలో అందించింది. తొలి ఇంక్రిమెంట్‌, డీఏ పెంపుతో జీతం పెరుగుదల కనిపించడంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన అనంతరం సకాలంలో ప్రొబేషన్‌ డిక్లేర్‌ చేయడం, శాశ్వత ఉద్యోగులుగా మారిన ఏడాదికి ఠంచన్‌గా ఇంక్రిమెంట్‌ ఇవ్వడంతో పాటు డీఏ పెంచడం పట్ల సచివాలయ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏను విడుదల చేయడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 1,188 సచివాలయాల్లో 6,999 ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది.

విడుదలైన ఇంక్రిమెంట్‌, డీఏ

గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఇంక్రిమెంట్‌ రూ.600 చెల్లించింది. డీఏను వార్డు సచివాలయ అడ్మిన్‌, గ్రామ సచివాలయ కార్యదర్శికి రూ.781, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.764 ప్రకారం పెంచారు. ఈ నేపథ్యంలోనే ... ప్రభుత్వ ఇంక్రిమెంట్‌తో పాటు డీఏ పెంచడంతో సచివాలయ ఉద్యోగులకు కేడర్‌ను బట్టి రూ.1503 నుంచి రూ.1546 వరకు జీతాలు పెరిగాయి.

16 శాతం హెచ్‌ఆర్‌ఏ ...

జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల లోపు ఉన్న సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 16 శాతం మేర హెచ్‌ఆర్‌ఏను అందిస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి సమీపంలోని వారికి రూ.950 అదనపు ప్రయోజనం చేకూరుతోంది. మిగిలిన ఉద్యోగులకు 12 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తిస్తోంది. మొదట్లో సచివాలయాల్లోని ఉద్యోగులందరికీ ఒకే రకమైన హెచ్‌ఆర్‌ఏ వర్తించగా, ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న వారికి అదనపు మేలు చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల వివరాలు

జిల్లా	గ్రామ సచివాలయాలు	వార్డు సచివాలయాలు	ఉద్యోగుల సంఖ్య
కర్నూలు	461	211	3,717
నంద్యాల	409	107	3,282
మొత్తం:	870	318	6,999



సీఎంకు కృతజ్ఞతలు



ప్రొబేషన డిక్లేర్‌ చేసి పేస్కేల్‌ ద్వారా జీతాలు చెల్లించడం, ఏడాది పూర్తి కాగానే ఇంక్రిమెంట్‌, డీఏతో కలిపి జీతాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. అలాగే జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల సమీపంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం హెచ్‌ఆర్‌ఏ 16 శాతం ఇవ్వడం హర్షించదగ్గ విషయం. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రవి, డిజిటల్‌ అసిస్టెంట్‌, కొలిమిగుండ్ల సచివాలయం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని డిపార్టుమెంటల్‌ టెస్ట్‌ పాస్‌ అయిన వారి ప్రొబేషన్‌ను డిక్లేర్‌ చేశారు. అలాగే ప్రొబేషన డిక్లేర్‌ అయిన ఏడాదికి ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏను విడుదల చేస్తున్నారు. జూలై నెల జీతంతో పాటు రూ.660 ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏ కలిపి రూ.1500 దాకా వచ్చింది. సచివాలయ ఉద్యోగుల కుటుంబాలు ఎల్లప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి రుణ పడి ఉంటాయి.

– ఫిరోజ్‌, అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌, ఇటిక్యాల ఆర్‌బీకే

ఉద్యోగులందరికీ అందేలా చర్యలు



ప్రొబేషన్‌ డిక్లేర్‌ అయి ఏడాది పూర్తి చేసుకున్న గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులందరికి రాష్ట్ర ప్రభుత్వం తొలి ఇంక్రిమెంట్‌ను విడుదల చేసింది. ఇప్పటికే మెజారిటీ సచివాలయాల ఉద్యోగులందరికీ రెగ్యులర్‌ జీతంతో పాటు ఇంక్రిమెంట్‌, పెరిగిన డీఏ సర్దుబాటు అయ్యింది. ఇంకా ఎక్కడైనా ఏవైనా కారణాల వల్ల అందని పరిస్థితి ఉంటే, వెంటనే పరిశీలించి చర్యలు చేపడతాం.

– జి. నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

శ్రీశైల చరిత్రపై మరింత పరిశోధన

- క్షేత్ర అంశాలపై కొత్త డాక్యుమెంటేషన్‌, గ్రంథ ముద్రణ
- వచ్చే నెలలో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ కొట్టు సత్యనారాయణ



దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల క్షేత్ర చరిత్రపై మరింత పరిశోధనకు వివిధ శాఖల్లో ప్రావీణ్యం కలిగిన పరిశోధకులతో మండలి ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం శ్రీశైలంలోని భ్రమరాంబా అతిథిగృహంలో శ్రీశైలక్షేత్ర పరిశోధన మండలి మొదటి సమావేశాన్ని మండలి కన్వీనర్‌, ఈఓ లవన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో క్షేత్ర సంబంధిత పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర చరిత్ర, సంస్కృతం, తెలుగు, కన్నడ, మరాఠి, తమిళం వివిధ భాషల్లో శ్రీశైల ప్రస్తావన అంశాలను ఆధారంగా క్షేత్ర సంబంధి అంశాలను పరిశోధించి ఫొటో, వీడియో డాక్యుమెంటేషన్‌, గ్రంథ ముద్రణ చేస్తామన్నారు. అలాగే ఘంటామఠం వద్ద లభించిన తామ్ర శాసనాలను ఆర్కియాలజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా(ఏఎస్‌ఐ) సహకారంతో పరిష్కరింపజేసి, తెలుగు వివరణతో ప్రచురిస్తామన్నారు. దేవస్థానానికి లభించిన 4,400 ఎకరాల భూమికి సంబంధించి ఫెన్సింగ్‌ ఏర్పాటుకు వచ్చె నెలలో సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీశైల దేవస్థానంలో శనివారం నుంచి వరుణయాగాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లోకేష్‌కు దమ్ముంటే కొడాలిపై పోటీ చేయాలి

టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు దమ్ముంటే గుడివాడలో కొడాలి నానిపై పోటీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సవాల్‌ విసిరారు. గురువారం ఆయన శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలు విశ్వసించడం లేదని.. కిరాయి గుండాలతో, తుపాకులతో బాబు మీటింగులకు వెళ్తున్నాడని, ఎన్ని జిమ్మికులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. యువగళం పేరుతో గందరగోళం సృష్టిస్తూ లోకేష్‌ ఊరూరు తిరుగుతున్నాడని.. బౌన్సర్లు, కిరాయి రౌడీలతో ప్రజల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నంద్యాల: నంద్యాల జిల్లా వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నూతన కమిటీని వైఎస్సార్‌ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ప్రకటించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటి వరకు కొనసాగుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డినే మళ్లీ నియమించింది. పార్టీ ఉపాధ్యక్షులుగా జింకా గుండయ్య యాదవ్‌ (శ్రీశైలం), షేక్‌ అబ్దుల్‌ సలాం (ఆళ్లగడ్డ), ప్రధాన కార్యదర్శులుగా ఎం.రామచంద్రారెడ్డి (బనగానపల్లె), కె.శ్రీనివాసరావు(నంద్యాల), ఎస్‌.శ్యాంసుందర్‌రెడ్డి(డోన్‌), ట్రెజరర్‌గా బి.నాగరాజు(నంద్యాల), కార్యదర్శులుగా డి.వనజ (నందికొట్కూరు), వై.తిమ్మయ్య (శ్రీశైలం), వై.రఘుమాధవరెడ్డి (పాణ్యం), జి.కృష్ణారెడ్డి (ఆళ్లగడ్డ), సోమసుందర్‌రెడ్డి (బనగానపల్లె), ఏ.వెంకటస్వామి (నంద్యాల), ఎం.మద్దయ్య (డోన్‌), కె.తిరుమలేశ్వరరెడ్డి (నందికొట్కూరు), ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా టి.నాగార్జునప్రసాద్‌ (నందికొట్కూరు), జి.పీరయ్య (నందికొట్కూరు), షేక్‌ ఇనాయతుల్లా (నందికొట్కూరు), సుజాతమ్మ (శ్రీశైలం), కోలా సుబ్బారావు (శ్రీశైలం), బండి రమణయ్య (శ్రీశైలం), కె.మహబూబ్‌బాషా (శ్రీశైలం), ఏ.వెంకటకృష్ణ (పాణ్యం), ఎస్‌.నాగేంద్ర(పాణ్యం), షేక్‌ మనీషాబీ (పాణ్యం), ఎస్‌.వెంకటేశ్వర్లు(పాణ్యం), ఎం.నాగరాజు (నందికొట్కూరు), ఎం.నాగశయనారెడ్డి (నందికొట్కూరు) ను పార్టీ అధిష్టానం నియమించింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్‌ పాపిరెడ్డి, కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ, మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ పీపీ నాగిరెడ్డి తదితరులు

- జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి
- జిల్లాలో 7,216 మంది లబ్ధిదారులకు రూ.8.30 కోట్ల లబ్ధి

నంద్యాల: నవరత్నాల పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా కొన్ని సాంకేతిక, ఇతర కారణాలతో ప్రయోజనం పొందని లబ్ధిదారులకు మరో అవకాశంగా ఎంపిక చేశారు. వీరికి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌ నొక్కి వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. డిసెంబరు 2022 నుంచి జూలై 2023 వరకు జిల్లాలో అర్హులైన 7,216 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8.30 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో లైవ్‌ ద్వారా జిల్లా పరిషత్‌ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ శామూన్‌, మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ పీపీ నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్‌ గిరిబోయిన చంద్రశేఖర్‌, ఏపీఎస్పీడీసీఎల్‌ డైరెక్టర్‌ శశికళారెడ్డి, హస్తకళల డైరెక్టర్‌ సునీత అమృతరాజ్‌, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌ రెడ్డి, జిల్లా పరిషత్‌ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంక్షేమ శాఖ డీడీ చింతామణి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశం కూడా ఇచ్చి మరీ ఏడాదికి రెండు పర్యాయాలు ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ శామూన్‌ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల కింద అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 7,216 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8.30 కోట్లు జమ చేశామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌, జిల్లా పరిషత్‌ చైర్మన్‌, మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ పీపీనాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు, ఏపీఎస్పీడీసీఎల్‌ డైరెక్టర్‌, హస్తకళల డైరెక్టర్లు అర్హులైన లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

జిల్లాలో వివిధ సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు..

సంక్షేమ పథకం	లబ్ధిదారుల సంఖ్య	కేటాయించిన మొత్తం
వైయస్సార్‌ ఆసరా	313	రూ.52.04 లక్షలు
జగనన్న వసతి దీవెన	1,295	రూ.1.17 కోట్లు
జగనన్న విద్యా దీవెన	1,470	రూ.2.17 కోట్లు
అమ్మఒడి	629	రూ.81.77 లక్షలు
జగనన్న చేదోడు	2,471	రూ.2.47 కోట్లు
ఈ బీసీ నేస్తం	337	రూ.50.55
వైఎస్సార్‌ నేతన్న నేస్తం	15	రూ.3.60 లక్షలు
వైఎస్సార్‌ రైతు భరోసా	686	రూ.59.37 లక్షలు
మొత్తం	7,216	రూ.8.30 కోట్లు

పర్యవేక్షణ మెరుగు‘బడి’

- సర్కారు బడుల్లో సరికొత్త మార్పులు
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి
- పేరెంట్స్‌ టీచర్ల సమావేశాల నిర్వహణ
- పిల్లల చదువుపై తల్లిదండ్రుల మరింత శ్రద్ధ



నంద్యాల టెక్కె పాఠశాలలో పేరెంట్స్‌ మీటింగ్‌కు హాజరైన తల్లిదండ్రులు

నంద్యాల(న్యూటౌన్‌): చదువుల విప్లవంతో సర్కారు బడుల రూపురేఖలు మారిపోతున్నాయి. నాడు – నేడుతో సౌకర్యాల కల్పన, పాఠశాలల విలీనంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఇదే క్రమంలో విద్యార్థులపై పర్యవేక్షణ పెంచి అభ్యసన సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. బోధన, విద్యాప్రమాణాల పెంపు అంశాల్లోనూ తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మేటివ్‌, సమ్మేటివ్‌–1 పరీక్షలు నిర్వహించారు. కాగా పరీక్షల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తల్లిదండ్రులకు వివరించేందుకు పేరెంట్స్‌ టీచర్స్‌ కమిటీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు సమావేశాల నిర్వహణ చేపట్టారు. నంద్యాల జిల్లాలో 1,409 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్‌ టీచర్స్‌ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలియజెప్పడం, సమస్యలు, లోపాలు ఉంటే సరిదిద్దుకునేందుకు ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తల్లిదండ్రులు వారి పిల్లల చదువుపై మరింత శ్రద్ధ కనబరిచే అవకాశం ఉంది.

ప్రయోజనాలివే..

పాఠశాలతో సమాజం, విద్యార్థుల తల్లిదండ్రుల అనుసంధానానికి దోహదం చేస్తుంది. విద్యార్థుల పురోగతిపై క్రమం తప్పకుండా చర్చలు జరపడం వలన వారికి అందించాల్సి సహకారం, రోజువారీ ఇంటి పనులు, పాఠ్య పుస్తకాల వినియోగం తదితరాలను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. పాఠశాలల అభివృద్ధి, విద్యాపరమైన పురోగతిలో తల్లిదండ్రులు భాగస్వాములవుతారు. పిల్లల చదువు, పరీక్ష ఫలితాలు తెలుసుకోవడంతో పాటు, మధ్యాహ్న భోజనం అమలు తీరును తల్లిదండ్రులు స్వయంగా పర్యవేక్షించవచ్చు. ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల్లో అభ్యసనా ప్రమాణాలు మెరుగు పడే అవకాశం కలుగుతుంది.

సూచనలు ఇలా..

- ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో క్లాస్‌ టీచర్‌, పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి.
- విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపి, సలహాలు అందించాలి.
- విద్యార్థుల పురోగతి, హాజరు, పిల్లల ప్రవర్తన, మూల్యాంకనం తదితర అంశాలను ఉపాధ్యాయుల తల్లిదండ్రులతో చర్చించాలి.
- చర్చించిన అంశాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, క్లాస్‌ టీచర్‌, రికార్డు చేసి మినిట్స్‌ తయారు చేసి ఎంఈఓ, డీఈఓకు పంపాలి.

బాధ్యత మరింత పెరుగుతుంది



ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్ల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్‌ టీచర్స్‌ సమావేశాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల అభ్యసన పట్ల అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరుగుతుంది. ప్రతి పాఠశాలల్లో పేరెంట్స్‌, టీచర్స్‌ కమిటీ సమావేశాలు కచ్చితంగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు

నంద్యాల(సెంట్రల్‌): డ్రిప్‌ విధానంలో పంటలు సాగు చేసే రైతులకు రాయితీపై పరికరాలు అందజేస్తున్నామని ఏపీఎంఐపీ పథక సంచాలకులు సత్యనారాయణ పేర్కొన్నారు. సూక్ష్మ సేద్య పథకం కింద మామిడి, సపోట, చీనీ, జామ, అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల మొక్కలు, పసుపు, ఉల్లి, శనగ, వేరుశనగ పంటలు సాగు చేసే అన్నదాతలను ప్రోత్సహించేందుకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఇస్తున్నామన్నారు. గతంలో రాయితీపై పరికరాలు తీసుకున్న రైతులు ఏడేళ్లు పూర్తి చేసి ఉంటే మళ్లీ అందిస్తామన్నారు. బిందు సేద్య పరికరాలను ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై, 5 – 10 ఎకరాల లోపు రైతులకు 75 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. అలాగే తుంపర సేద్య పరికరాలను ఐదు ఎకరాల లోపు రైతులకు 55 శాతం, 5 – 10 ఎకరాల లోపు భూమి కలిగిన వారికి 45 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 7,188 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 2,998 మందికి సంబంధించి ప్రాథమిక విచారణ పూర్తయ్యిందన్నారు. వీరిలో 1,569 మంది డబ్బులు చెల్లించగా 1,498 మందికి పరికరాలు మంజూరయ్యాయన్నారు. 729 మందికి పరికరాలు అందజేశామన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు: డీఐజీ



సెంథిల్ కుమార్, కర్నూలు రేంజ్ డీఐజీ

కర్నూలు: రాయలసీమ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించి దేహదారుఢ్య పరీక్షలకు వెళ్తున్న అభ్యర్థులు దళారుల మాటలు నమ్మొద్దని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అధునాతన టెక్నాలజీ ఉపయోగించి పరీక్షలు నిర్వహిస్తున్నందున నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉంటుందన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా దేహదారుఢ్య పరీక్షలు సాంకేతికత, సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. నియామక ప్రక్రియ మొత్తం పోలీసు అధికారుల సమక్షంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడతామన్నారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎవరైనా ప్రలోభపరిస్తే అలాంటి దళారుల సమాచారం డయల్ 100కు గాని, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు గానీ అందించాలని పేర్కొన్నారు.

మెలకువలే విజయ సోపానాలు

జాగ్రత్తలు పాటిస్తేనే పరీక్షల్లో ఉత్తీర్ణత
- ఎస్‌ఐ ఉద్యోగార్థులకు నిపుణులు, శిక్షకుల సూచనలు
- నేటినుంచి ఏపీఎస్పీ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు

కలల కొలువులో కీలక ఘట్టాన్ని అధిగమించే సమయం ఆసన్నమైంది. ఇన్నాళ్లు సాగించిన కఠోర శ్రమకు ఫలితం దక్కాలంటే ఎస్‌ఐ ఉద్యోగార్థులు దేహదారుఢ్య పరీక్షల్లో అప్రమత్తంగా మెలగాలని నిపుణులు, శిక్షకులు సూచిస్తున్నారు. ఎన్ని రోజులు సాధన చేశామన్నది పక్కన పెడితే, ఎంత మెలకువగా ఒక్కొక్క అంశంలో అర్హత సాధిస్తూ ముందుకు సాగుతున్నామనేది కీలకమంటున్నారు. కర్నూలు ఏపీఎస్పీ మైదానంలో శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం. – కర్నూలు

ట్రాక్ ఫస్ట్ ర్యాక్‌లోనే పరిగెత్తాలి



1600 మీటర్ల పరుగుపందెంలో నాలుగు లాప్స్ ఉంటాయి. ఫస్ట్ లాప్‌లో మీడియం వేగంతో పరిగెత్తాలి. అప్పుడే శ్వాసపై పట్టు దొరుకుతుంది. మూడో లాప్ నుంచి స్ప్రింట్ తీసుకుని వేగం పెంచాలి. 200 మీటర్ల దూరం మిగిలి ఉన్నప్పుడు వేగంగా పరిగెత్తాలి. వీటిని ట్రాక్ ఫస్ట్ ర్యాక్‌లో పరిగెత్తుతూ చేయాలి. అప్పుడే అనుకున్న మార్కులు సాధించవచ్చు. మొదటి రెండు రౌండ్లను సాధన మాదిరిగా సాగించి మిగిలిన రౌండ్లలో వేగం పెంచుకోవడం కీలకం. – పి.నాగస్వామి, ఏఆర్‌ఎస్‌ఐ, స్పెషల్ పార్టీ ఇన్‌చార్జి

టేక్ ఆఫ్ బోర్డు వద్ద లెగ్ స్టాంప్ వేయాలి



లాంగ్‌జంప్‌లో పాల్గొనేముందు స్కిప్ జంప్స్ చేసుకోవాలి. ఏ లెగ్ అలవాటు ఉంటుందో దాన్నే టేక్ ఆఫ్ బోర్డు వద్ద స్టాంప్ వేయాలి. ఎంత గట్టిగా నొక్కితే అంత దూరంగా జంప్ చేయవచ్చు. టేక్ ఆఫ్ బోర్డును టచ్ చేయకుండా చూడాలి. భూమి, కాలికి మధ్య చర్య, ప్రతిచర్య ఏర్పడి గాలిలో ఎత్తుకు ఎగిరి దూరంగా దూకడానికి ఆస్కారం ఏర్పడుతుంది. శరీరాన్ని గాలిలో తేలిపోయేలా ముందస్తుగానే ఫ్రీ చేసుకోవాలి. ఈ క్రమంలో నిరుత్సాహానికి, భయానికి గురి కాకూడదు. పురుషులైతే 3.75 మీటర్లు, మహిళలైతే 2.75 మీటర్లు దూకితేనే క్వాలిఫై అవుతారు. – వై.రవికుమార్, అథ్లెటిక్ శిక్షకుడు

ఛాతీలో నొప్పిగా అనిపిస్తే తప్పుకోవాలి



శారీరక సామర్థ్య పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులు జలుబు, దగ్గు వంటివి ఉంటే గోరువెచ్చని నీటిని తాగాలి. పాలు లేదా ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలి. పరుగెత్తుతున్న సమయంలో కళ్లు తిరిగినట్లు, ఛాతీ నొప్పి అనిపిస్తే వెంటనే తప్పుకోవాలి. అవసరం ఉంటే వైద్యున్ని సంప్రదించి చికిత్స పొందాలి. అలా కాకుండా ఉద్యోగంపై ఆశతో ఈవెంట్‌లో పాల్గొంటే ప్రమాదకరమవుతుంది. శ్వాస సమస్యలు రాకుండా ఉండేందుకు మెడిటేషన్ చేయాలి. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. ఈవెంట్స్‌లో పాల్గొనేముందు నిమ్మకాయ రసం, కూల్‌డ్రింక్స్ వంటివి వాడటం మంచిది కాదు. – డాక్టర్ పి.ఎల్.వెంకట పక్కిరెడ్డి, నెఫ్రాలజిస్టు, ప్రభుత్వ వైద్యశాల

శ్వాస నియంత్రణే ప్రధానం



పరీక్షలు జరిగే మైదానంలోకి సకాలంలో అడుగు పెట్టాలి. ఈవెంట్ ప్రారంభమయ్యే పది నిముషాల ముందు బ్రీతింగ్ వ్యాయామం అవసరం. ట్రాక్ ఫస్ట్ ర్యాక్‌లోనే లాస్ట్ పించింగ్ వరకు రన్నింగ్ చేయాలి. లాస్ట్ పించింగ్ ఫుల్ స్పీడ్‌గా ఉండాలి. నోటితో ఉచ్ఛ్వాస, నిశ్వాస వల్ల ఎక్కువసేపు పరిగెత్తవచ్చు. – చిన్న సుంకన్న, అధ్యక్షుడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం

ప్రతిభా పాటవాలు చిప్‌లో నిక్షిప్తం



ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మొదలైనప్పటి నుంచి వారి ఛాతీ నెంబర్‌పై క్యూ ఆర్ కోడ్‌తో కూడిన బ్యాడ్జి ఉంటుంది. పరుగు పోటీల సమయంలో కాళ్లకు సెన్సార్ చిప్స్ అమర్చిన ట్యాగ్ ఏర్పాటు చేస్తాం. ఇవన్నీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సర్వర్‌కు అనుసంధానమై ఉంటాయి. పరుగు మొదలై ముగిసే సమయం వరకు ప్రతి సెకను ఆ చిప్ ద్వారా కంప్యూటర్‌లో నమోదవుతుంది. అభ్యర్థి మైదానం వీడే వరకు అది అతని కాళ్లకు ఉంటుంది. పరీక్షలు ముగిసిన అనంతరం అధికారి పర్యవేక్షణలోనే బ్యాండ్‌ను తొలగిస్తారు. అభ్యర్థుల ప్రతిభా పాటవాలు చిప్‌లోనే నిక్షిప్తమవుతాయి. ఈ తతంగమంతా నిఘా నేత్రాల పర్యవేక్షణలో సాగుతుంది. సరికొత్త సాంకేతి పరిజ్ఞానంలో, హై ఫ్రీక్వెన్సీ(ఎల్‌హెచ్‌ఎఫ్) ఉపయోగిస్తున్నాం. ప్రతి విభాగంలో ఏ చిన్న పొరపాటుకు తావు లేకుండా ఏర్పాట్లు జరిగాయి. పరుగు పందెంలో అర్హత సాధిస్తేనే ఎత్తు, కొలతలు, లాంగ్‌జంప్ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం డిజిటల్ నిఘా ఏర్పాటు చేశాం. – కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ

అలరించిన దాసవాణి



సంకీర్తనలు ఆలపిస్తున్న హరిచందన వెంకటేష్

మంత్రాలయం: చాతుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ధార్మిక పారాయణం, విభావరి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గురువారం శ్రీమఠం ప్రవచన మంటపంలో తిరుపతికి చెందిన హరిచందన వెంకటేష్ బృందం దాసవాణి గావించారు. కార్యక్రమంలో శ్రీమఠం దాస సాహిత్య ప్రాజెక్టు సభ్యులు అప్పన్నాచార్, పద్మనాభ ఆచార్, ప్రాణేష్ ఆచార్ పాల్గొన్నారు.

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): క్రీడా పురస్కారాల కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో దరఖాస్తులను అందజేయాలని ఆ సంస్థ సీఈఓ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పురస్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు పతకాలు సాధించిన వారు అర్హులని తెలిపారు. జాతీయ స్థాయిలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు ఏదైన క్రీడాంశంలో కర్నూలు జిల్లా తరఫున పతకాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9866317318 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విష్ణు.. ఇదేమి చోద్యం!

- నాగులాపురం చెరువు ఆక్రమణకు గురైందని నాలుగు రోజుల క్రితం ఆవేదన
- నేడు గార్గేయపురం చెరువు దురాక్రమణ
- టీడీపీ నేత చర్యలను ఖండిస్తున్న ప్రజలు
- చెరువును కాపాడేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని విన్నపం

కర్నూలు(సెంట్రల్/న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబం గార్గేయపురం చెరువును ఆక్రమణలోకి తెచ్చుకోవాలని చూస్తోంది. గతంలో నియోజకవర్గంలోని పలు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని స్వయంగా విష్ణువర్ధన్‌రెడ్డి గగ్గోలు పెట్టారు. అయితే నేడు గార్గేయపురం చెరువును ఆక్రమించుకోవడానికి అడ్డదారులు తొక్కడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు గ్రామాల రైతులకు సాగు, తాగునీటిని అందించే చెరువు రూపురేఖలు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీలో నియోజకవర్గ స్థాయి నాయకుడు అయి ఉండి ఇలా చేయడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం చెరువు దురాక్రమణపై కఠినంగా వ్యవహరించి అతనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరైనా చేస్తేనే తప్పు..వాళ్లు చేస్తే ఒప్పా?

ఎవరైనా తప్పు చేస్తేనే తప్పు...తాముచేస్తే తప్పు కాదన్న చందంగా టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబం వ్యవహరిస్తోంది. నాలుగు రోజుల క్రితం గూడూరు మండలం నాగులాపురం చెరువుకు సమీపంలోని భూములను ఆక్రమిస్తున్నారని స్వయంగా విష్ణువర్ధన్‌రెడ్డి స్థానికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో చెరువులో రైతులకు ఎలా పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. నిజానికి గతంలో అక్కడ 16 మంది రైతులకు డీ పట్టాలు ఇచ్చారు. డీ పట్టాలు పొందిన రైతులు పవన విద్యుత్ కోసం గ్రీన్ కో కంపెనీకి లీజు ప్రతిపాదికన అప్పగించడానికి ఒప్పందం చేసుకోవడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దానిని వ్యతిరేకిస్తూ కొందరు చేపట్టిన దీక్షలకు ఆయనే స్వయంగా వెళ్లి చెరువును ఆక్రమించడం అన్యాయమని చెప్పారు. అలాగే విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు బతికి ఉన్న సమయంలో బి.తాండ్రపాడు చెరువు ఆక్రమణకు గురవుతోందని ఏకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆ కేసు ఇప్పటికీ ట్రిబ్యునల్‌లో నడుస్తూనే ఉంది.

దురాక్రమణ నుంచి విముక్తి కలిగించాలి

గార్గేయపురం చెరువును టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పూడ్చి వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు పూనుకోవడంతో గురువారం 'సాక్షి'లో చెరువును చెరబట్టిన విష్ణు అనే కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి వెంటనే చెరువు పూడ్చివేత పనులను నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు ఇప్పటికిప్పుడు ఏదో తూతూ మంత్రంగా కాకుండా చెరువును దురాక్రమణ నుంచి పూర్తిగా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతానికి దెబ్బ!

కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరవనానికి గార్గేయపురం చెరువు హాట్ స్పాట్. ఇక్కడ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇందుకోసం కోట్లు ఖర్చు పెట్టి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అయితే ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినా చెరువు లేకుండా పోతే ఎందుకు పనికి రాకుండా పోతోంది. కర్నూలు నగర ప్రజలకు గార్గేయపురం అతి ముఖ్యమైన పర్యాటక ప్రాంతం. అంతేగాక నందనపల్లె, మిలిటరీకాలనీ, పరిదెంపాడు, పూడూరు, గార్గేయపురం గ్రామాల రైతులకు సాగు, తాగునీటి వనరు. ఇంతా ప్రాధాన్యం కలిగిన చెరువు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు చూసీ చూడనట్లు ఉండడం మంచి కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆక్రమార్కుల నుంచి చెరువుకు పూర్తి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చెరువు పూడ్చివేత పనులు తక్షణమే ఆపేయాలి

- లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
- ఆర్‌డీఓ హరిప్రసాదు

సాక్షి ఎఫెక్ట్



చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హరిప్రసాదు తదితరులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం చెరువు పూడ్చివేత పనులను తక్షణమే నిలుపుదల చేయాలని టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డిని ఆర్‌డీఓ డి.హరిప్రసాదు ఆదేశించారు. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కర్నూలు ఆర్‌డీఓ డి.హరిప్రసాదు, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు చెరువును పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలించారు. గతంలో కొందరికీ మాజీ సైనికులకు కేవలం చెరువులో నీళ్ల లేని సమయంలో పంటలను సాగు చేసుకోవడానికే అనుమతులు ఇచ్చారన్నారు. వారికి ఆ భూములను అమ్ముకోవడానికి ఎలాంటి అధికారం లేదన్నారు. ఎవరూ కొన్నా హక్కులు రావన్నారు. చెరువును పూడ్చితే నీళ్ల రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ భూములను డీనోటిపై చేయడం కోసం, కన్వర్షన్ కోసం వచ్చిన అనేక వినతులను తిరస్కరించామన్నారు. కేవలం అక్కడ అనుభవందారులు చెరువులో నీళ్ల లేని సమయంలో పంటలు సాగు చేసుకోవాలన్నారు. అంతేగాని ఇతర అవసరాల కోసం వినియోగించేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్న విషయాన్ని గమనించాలన్నారు. మరోవైపు చెరువు విస్తీర్ణంపై పూర్తి స్థాయి విచారణ చేపడుతామని ఆయన వివరించారు.

ప్రియుడు మోసం చేశాడని..

- వైద్య విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన శ్రావణి

బొమ్మలసత్రం: ప్రియుడు చేతిలో మోసపోయిన ఓ వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న వెంకటేశ్వర్లు కుమార్తె శ్రావణిని కడప మెడికల్ కళాశాలలో బీహెచ్‌ఎమ్‌ఎస్ నాలుగో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలలో ఆమె సమీప బంధువు కర్నూలుకు చెందిన ధీరజ్‌కుమార్ హౌస్‌సర్జన్‌గా పని చేస్తున్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అయితే కొన్ని రోజుల క్రితం వివాహం చేసుకోవాలని శ్రావణి అడగడంతో ధీరజ్ అంగీకరించలేదు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శ్రావణి మనస్తాపం చెందింది. దీంతో ఈనెల 16వ తేదీన ఇంట్లో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం పద్మావతినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందింది. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన అమీర్‌బాషా

బనగానపల్లెరూరల్: పట్టణంలోని అవుకు మెట్ట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏఎస్‌ఐ లక్ష్మన్న తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణం సంతోపేటకు చెందిన ఎస్. అమీర్‌బాషా (38) ఇంటి నిర్మాణం కోసం కంకర నిమిత్తం బనగానపల్లెకు ట్రాక్టర్ డ్రైవర్ ఖాదర్‌బాషాతో వచ్చారు. కంకర లోడుతో తిరుగు వెళ్తూ అవుకు మెట్ట సమీపంలో టీ తాగేందుకు ట్రాక్టర్‌ను నిలిపారు. అదే సమయంలో బనగానపల్లె నుంచి అవుకు వైపు అతివేగంగా వెళ్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అమీర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందగా ఖాదర్‌బాషాకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అమీర్‌బాషా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ఆషా, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

18,984 క్యూసెక్కుల నీరు విడుదల



శ్రీశైలం డ్యాం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు బుధవారం నుంచి గురువారం వరకు 18,984 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 7వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతి 2,025 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 490 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,026 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.229 మిలియన్ యునిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 7,132 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం సాయంత్రం సమయానికి జలాశయంలో 96.4964 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 856.80 అడుగులకు చేరుకుంది.

జేకేసీ మానిటరింగ్ సెల్ ప్రారంభం



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ చాంబర్ కారిడార్‌లో జేకేసీ మానిటరింగ్ సెల్ అండ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల స్పందన వినతుల సత్వర పరిష్కారానికి సంబంధించి మానిటరింగ్ చేసేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్పందన ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని 24గంటల లోపల స్పందన పోర్టల్‌లో పరిశీలించి నిర్ణీతకాల పరిమితిలోగా పరిష్కరించేందుకు వీలుగా సంబంధిత అధికారులతో మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన పనుల పురోగతి అంశాలు, జగనన్నకు చెబుదాం – స్పందన పరిష్కారాలపై ప్రజల సంతృప్తి, అసంతృప్తులు, జిల్లాలో చేపడుతున్న వివిధ రకాల సర్వేలు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించినందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ దోహదపడుతుందన్నారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అడిషనల్ కో–ఆర్డినేటర్లు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది తదితరులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని కలెక్టర్ వివరించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఓవరాల్ ఇన్‌చార్జిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఎం సీఈఓ వ్యవహరిస్తారన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎంఎంరెడ్డి మృతి



డాక్టర్ మద్దిలేటిరెడ్డి (ఫైల్)

ఉయ్యాలవాడ: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తొలి పీడియాట్రిక్ సర్జన్‌గా పేరుగాంచిన డాక్టర్ ఎం. మద్దిలేటిరెడ్డి(82) మృతి చెందారు. సుద్దమల్ల గ్రామానికి చెందిన ఎంఎంరెడ్డి 1942లో జన్మించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. చండీగఢ్‌లోని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఎస్ (పీడియాట్రిక్ సర్జన్) పూర్తి చేశారు. అలాగే ఎంఎస్‌లో గోల్డ్‌మెడల్ పొందారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా, హైదరాబాదు నీలోఫర్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా, ఉస్మానియా మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ పొంది హైదరాబాదులో స్థిరపడ్డారు. అనారోగ్య కారణంగా రెండు రోజుల క్రితం మృత్యువాతపడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. డాక్టర్‌కు భార్య సుగుణమ్మ, అమెరికాలో డాక్టర్లుగా స్థిరపడిన కుమారుడు మధుకర్‌రెడ్డి, కుమార్తె వాణిశ్రీ ఉన్నారు.

జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల తవ్వకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు స్లాబ్ స్థాయి వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్న 1,140 చోట్ల అనువైన స్థలాల్ని గుర్తించామన్నారు. వీటిలో 1,119 గుంతలకు అంచనాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గృహనిర్మాణ శాఖతో సమన్వయం చేసుకుని వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులను గుర్తించండి

- సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి లబ్ధిదారులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ స్పందన అంశాలపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభించనున్నట్లు చెప్పారు. 18 వృత్తుల కళాకారులకు ఈ పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలు బడుల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో బడి బయట ఉన్న పిల్లలను ఓపెన్ స్కూళ్లు, కాలేజీల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖరీఫ్ పంటలకు ఊపిరి



మిరప పంటకు సాగునీరు మళ్లించిన దృశ్యం

దొర్నిపాడు: నిన్నటి వరకు.. వాన చినుకు రాలకపోవడంతో పంటలు వాడు ముఖం పట్టాయి. మరి కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోవడం ఖాయమని గుర్తించిన అధికారులు కేసీకి సాగునీరు విడుదల చేయడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఊపిరి పోసినట్లయ్యింది. రైతులు తొలిపంటగా సాగచేసిన మినుము, బెండ, కొర్ర, మిరప, మొక్క జొన్న పంటలు మళ్లీ పచ్చనం పులుముకుంటున్నాయి. ప్రస్తుతం రైతులు పంటలకు నీటిని మళ్లించుకునే పనిలో ఉన్నారు.

డ్రైనేజీ పనులకు శ్రీకారం

ఉయ్యాలవాడ : మండలంలో రూపనగుడి గ్రామంలోని మురుగు నీటిని బయటకు పంపేందుకు ప్రధాన కాలువ నిర్మాణం పనులను రూ.5 లక్షల వ్యయంతో చేపట్టారు. గురువారం నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ పరిశీలించి మాట్లాడారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యను వివరించడంతో ఆయన నిధులు మంజూరు చేయించారని చెప్పారు. 250 మీటర్ల పొడువున చేపట్టిన డ్రైనేజీ పనులు పూర్తయితే ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని ఏఈ చెప్పారు.

విద్యుత్ సమస్యలు తలెత్తనీయొద్దు

గోస్పాడు: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో వసూలు చేయాలని చెప్పారు. బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని, మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రుద్రవరం: తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి జంప్ రోప్ అండర్-14 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు.. రాజేశ్వరి, స్పందన, అలేఖ్య, వర్ష, ఉషను అభినందించారు. వీరు సెప్టెంబర్ 9,10 తేదీల్లో గుటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పీడీ శ్రీనివాసులు ఉన్నారు.

31లోపు చెంచుల అభివృద్ధి సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని చెంచు గిరిజన గూడేల్లో మౌలిక వసతులపై చేపట్టిన సమగ్ర సర్వేను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి ఆదేశించారు. స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో గురువారం ఐటీడీఏ శ్రీశైలం పరిధిలోని చెంచు గిరిజన గూడేలలో గిరిజనుల మౌలిక వసతులపై 14 మండలాల ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లతో మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి సురేష్‌కుమార్, పీఎంకేజీ నాయక్, ఎస్‌ఆర్ఈజీఎస్ టీపీ రవీంద్ర పాల్గొన్నారు.

ఆప్షనల్ హాలిడేను యధాతథంగా ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆప్షనల్ హాలిడేను రాష్ట్ర ప్రభుత్వం యధాతథంగా ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సెలవుల జాబితాలో పేర్కొన ట్లుగా అప్షనల్ హాలిడేను అమలుచేయాలన్నారు. మధుసూదనరావు, మల్లెల్ల పుల్లయ్య, రవి, మునిస్వామి, నగిరి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో గురువారం విద్యుత్ ఉద్యోగి జగదీష్‌పై నరసింహుడు అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ట్రాన్స్‌కో ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. విద్యుత్ బిల్లుల వసూళ్లలో భాగంగా ఉద్యోగి నిందితుడు ఇంటి వద్దకు వెళ్లి బకాయి చెల్లించాలని కోరగా.. బిల్లు చెల్లించక పోగా ఉద్యోగిపై దురుసుగా మాట్లాడి దాడికి పాల్పడ్డాడు. బాధితుడితో వెళ్లి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఏఈ చెప్పారు.



21వ బ్లాకు కాల్వలో పారుతున్న సాగునీరు



ఎర్రగుడిదిన్నె వద్ద మినుము పంటలో ట్రాక్టర్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



రెడ్డిపల్లె సమీపంలో కంకి దశలో మొక్కజొన్న

గంగ గలగల..పంటలు కళకళ

- ఊపందుకున్న వ్యవసాయ పనులు

రుద్రవరం: మండలంలోని 21పంచాయతీల పరిధిలో తెలుగుగంగ కాల్వల ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు, కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమయ్యారు. వారం క్రితం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టాయి. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం వెలుగోడు రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాల్వకు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. నీటి రాకతో భూగర్భజలాలు పెరిగి బోరు మోటార్ల నుంచి నీటి ఊట పెరిగింది. బోరు మోటార్లు లేని రైతులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా కాల్వ నీటిని పంటలకు మళ్లించుకుంటున్నారు. దీంతో వాడుముఖం పట్టిన పంటలు పచ్చదనం పులుముకున్నాయి. ప్రస్తుతం రైతులు పైర్లకు మందులు పిచాకారీ చేయడం, అంతరసేద్యం తదితర పనుల్లో బిజీగా ఉన్నారు.



పేరూరు వద్ద కందిలో అంతర్‌పంటగా సాగుచేసిన మినుము

మండలంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం దాదాపు 25వేల ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 10,912 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. కాగా ముందస్తుగా సాగు చేసిన మొక్కజొన్న, మినుము కోతలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోసుకున్నారు.

మండలంలో సాగైన పంటల వివరాలు..

పంట	విస్తీర్ణం(ఎకరాల్లో)
మొక్కజొన్న	5,690
వరి	3,320
మినుము	1,282
పత్తి	325
మిర్చి	260
పసుపు	74
పెసర	28
ఇతర పంటలు	233



తువ్వపల్లె వద్ద పసుపు పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న మహిళా రైతు



బి.నాగిరెడ్డిపల్లె వద్ద కాల్వలోని నీటిని ఆయిల్ ఇంజిన్‌తో పొలాలకు మళ్లించుకుంటున్న దృశ్యం



రుద్రవరం నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి నారు

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన డ్రస్‌కోడ్ పాటించాలనిచ రోజూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులకు పథకాలు అందేలా చూడాలని చెప్పారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ రవికుమార్ మండల స్థాయి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన రివ్యూ సమీక్షలో ఆయన మాట్లాడారు. శాఖలపరంగా ఆయా శాఖలకు ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు అధికారులు మాత్రం పరిష్కార దశలో ఉన్నాయని, త్వరలో పరిష్కరిస్తామని తెలపగా, మరి కొందరు కింది స్థాయి, సచివాలయ ఉద్యోగులపై నెట్టడంతో తహసీల్దార్, ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరసింహరావు, వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్‌కృష్ణ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం

నంద్యాల(సిటీ): అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ నగర్ 38వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ టీవీ. రమణతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. సామాన్యులు ఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా నేరుగా అభివృద్ధి ఫలాలను వారి గడపకే అందిస్తూ ప్రజల మన్ననలు చూరగొంటున్నామన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికల సమయంలో పథకాల వల విసరకుండా, మీకు మంచి జరిగితేనే మమ్మల్ని మరోసారి ఆదరించాలని కోరిన ఏకైక నాయకుడు సీఎం జగనన్న మాత్రమేనన్నారు. ఇంటింటికీ తిరిగి పథకాల గురించి, బుక్‌లెట్ అందజేసి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహారావు శెట్టి, తిరుపతయ్య, జాకీర్ హుసేన్, అన్వర్ బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామిశెట్టి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): చంద్రయాన్-3 విజయవంతం కావడంతో నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి, రఘుప్రకాష్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు సమష్టి విజయమన్నారు. ఈ మిషన్‌ను విజయవంతం చేయడంలో ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు ప్రతి ఒక్కరి అద్భుతమైన కృషిని అభినందించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, రమేష్, శివశంకర్‌రెడ్డి, భూపని వెంకటేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): చంద్రయాన్-3 విజయవంతంపై పట్టణంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సంఘం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం కావడంతో దేశానికి ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆళ్లగడ్డ: చంద్రయాన్ 3 విజయవంతమైన సందర్భంగా గురువారం పట్టణంలో ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు..

దూషించిన వారిపై చర్యలు తీసుకోండి

నంద్యాల(వ్యవసాయం): వైఎస్సార్‌సీపీ నాయకులను దూషిస్తూ, చంపేస్తామన్న టీడీపీ నాయకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన యువగళం పాదయాత్ర బహిరంగ సభలో టీడీపీ నాయకులు అయ్యన్నపాత్రుడు, నారాలోకేష, దేవినేని ఉమా, బుద్ధా వెంకన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులను దూషించడం నేరమన్నారు. ముఖ్యమంత్రిని సైతం విమర్శించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వారిపై కేసు నమోదు చేయాలంటూ గురువారం ఏఎస్ఐ వెంకటశేషయ్యకు వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్ ముక్కెర కృష్ణారెడ్డి, ఓబులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బయ్య, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న లీగల్ సెల్‌నాయకులు

నీటిని వృథా చేయొద్దు

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల్లో పారే నీటిని వృథా కానివ్వకుండా అవసరమైనంత మేరకే వాడుకోవాలని ఆ శాఖ ఈఈ రాజశేఖర్ రైతులకు సూచించారు. గురువారం ఆయన తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట వెళ్తూ 16 నుంచి 20వ బ్లాక్‌ఉప ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ.. ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్ నుంచి అహోబిలం సమీపంలో ఉన్న 29వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ వరకు సాగు నీరు పారుతుందని, నీటిని వృథా కానివ్వకుండా సిబ్బంది పరిశీలించాలని సూచించారు.

గోరుకల్లు రక్షణకు చర్యలు చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): గోరుకల్లు రిజర్వాయర్ రక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్‌లో కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 261.5 మీటర్ల గరిష్ట స్థాయిలో 12.44 టీఎంసీల నీటిని నిల్వ ఉంచడానికి డిజైన్ చేశారన్నారు. గరిష్టస్థాయిలో ఉన్నప్పుడు వచ్చే నీటి అలల తాకిడిని తట్టుకునేలా రిజర్వాయర్ బండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. తక్కువ ఎత్తులో బండ్ ఏర్పాటు చేశారని, అలాకాకుండా పూర్తిస్థాయిలో ప్రతిపాదించిన డిజైన్ మేరకు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో పేదలకు ఆర్థిక భరోసా

ఆళ్లగడ్డ: సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేద కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పడకండ్ల సచివాలయ పరిధిలోని శారదానగరం, వెంకటేశ్వరపురం కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చేనేత కార్మికుల ఇళ్లల్లోకి వెళ్లి చేతి మగ్గాలను పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ రమేష్ బాబు, నాయకులు సుధాకర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, చిన్న రామిరెడ్డి, చిన్నవెంకటసుబ్బయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

గోవిందపల్లెలో నాలుగేళ్లలో రూ.45కోట్లు అందజేత

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో మండలంలోని గోవిందపల్లె గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.45కోట్లు జమ చేశామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి తెలిపారు. గురువారం గోవిందపల్లెలో 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అందిన పథకాలు, లబ్ధి పొందిన మొత్తం వివరాలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ పాలనలో కేవలం 956 పింఛన్లు ఉండేవని, ప్రస్తుతం అవి తమ రెట్టింపయ్యాయన్నారు. అలాగే జగనన్న అమ్మఒడి 1074, విద్యా దీవెన 765 మంది, వసతి దీవెన 459 మంది, చేదోడు కింద 432 మంది అబ్ధి పొందుతున్నారన్నారు. వాహన మిత్ర 67 మంది, వైఎస్సార్ చేయూత 1,098 మంది, రైతు భరోసా 3,456 మంది , ఈబీసీ నేస్తం 346 మందికి అందుతోందని చెప్పారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి పనులు కూడా జరిగాయన్నారు. బస్‌స్టాప్ నుంచి ఎస్సీ కాలనీ మీదుగా 25 ఏళ్ల తర్వాత రూ.1.76 కోట్లతో మురుగు కాల్వలు, సిమెంట్ రోడ్డు వేశామన్నారు. రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.25 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచు మరియమ్మ, ఉప సర్పంచు శేషారెడ్డి, ఎంపీటీసీ స్వాతి, సొసైటీ చైర్మన్ నర్ల రాజశేఖరరెడ్డి, పుల్లారెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, బీ.అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హాఫీజ్, వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల శివారెడ్డి, ఉశేనిరెడ్డి. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.





గోవిందపల్లెలో యువకుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల, చేనేత కార్మికుడి పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రధాన సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయ అభివృద్ధి నిధుల ఖర్చుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం అభివృద్ధి నిధుల్లో భాగంగా ఒక్కో వార్డు సచివాలయానికి రూ. 50 లక్షలు మంజూరు చేశారని, మొత్తం 10 వార్డు సచివాలయలకు కలిపి రూ 5 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. వీటిని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల సూచన వివిధ అభివృద్ధి పనులకు వెచ్చిస్తామని తెలిపారు. కమిషనర్ రమేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

రేపు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీన పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునిశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని డిగ్రీ చదివి, 25 సంవత్సరాల్లోపు గల యువతీ యువకులు రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాల కోసం నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం

దొర్నిపాడు: ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు సురక్షితం అని, ఇళ్లవద్ద ప్రసవాలు చేయించడం ప్రమాదకరమని వైద్యాధికారి నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రానికి చెందిన స్వప్న అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో స్థానిక పీహెచ్‌సీకి ఆశా వర్కరు సుశీలమ్మ సాయంతో వచ్చారు. ఉదయం 9:15 గంటలకు సాధారణ కాన్పు చేసినట్లు చెప్పారు. వెంటనే బాబుకు విటమిన్ కే, టీకాలు వేశామని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు.

ఉచిత రక్తగ్రూప్ నిర్ధారణ

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రీయ స్వయం సేవాక్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం సేవా భారతి, సేవాసప్తాహంలో భాగంగా స్థానిక వివేకానంద సెంటర్‌లో ప్రజలకు ఉచిత రక్తగ్రూప్ నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సేవా ప్రముఖ్ సంఘ శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల బ్లడ్ సెంటర్ సహకారంతో 200 మందికి పైగా రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మనోహర్, రఘురాం, రాఘవ, కేశవ, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు..జన్మభూమి కమిటీలతో పేదలకు అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

శిరివెళ్ల: గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలతో అర్హులైన పేదలకు పథకాలు అందలేదని, దీంతో వారికి తీరని అన్యాయం జరిగిందని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. మోత్కల సర్పంచు టీడీపీ మద్దతుదారుడు భూమా వేణుగోపాలరెడ్డి మాట్లాడుతు ప్రస్తుతం పథకాలు కొందరికే అందుతున్నాయని రాజకీయ ఉపన్యాసం చేశారు. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకొని మా ప్రభుత్వంతో కులం, మతం, రాజకీయం, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని దీటుగా సమాధానం చెప్పారు. సాగునీటిపై సదరు సర్పంచు విమర్శించబోగా ఎంపీపీ జోక్యం చేసుకుంటూ వర్షాభావంతో డ్యాంలో ఉన్న నీటిని విడుదల చేశారిని, వాటిని రాజకీయం చేయడం తగదన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే యథావిధిగా నీరు ఇస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. పంచాయతీ నిధులకు ఇది అదనమన్నారు. అలాగే ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గుండంపాడుకు రూ. 5 లక్షలతో ఆర్వో ప్లాంట్ మంజూరైందని సర్పంచు స్థలం చూపితే పనులు మొదలవుతాయని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పగ, ప్రతీకారాలతో ఏం సాధించలేం

దొర్నిపాడు: గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉండాలని..పగలు ప్రతీకారాలతో ఏమి సాధించలేమని ఎస్ఐ తిరుపాల్ సూచించారు. గురువారం రాత్రి మండలంలోని అర్జునాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. రుణయాప్‌ల ద్వారా మోసపోవద్దన్నారు. పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కోరారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

మొరాయిస్తున్న సర్వర్



దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు యత్నిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్

నంద్యాల(అర్బన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ సంతకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేసే సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రభుత్వ పథకాల దరఖాస్తులు ఆన్‌లైన్ అనుమతుల సంతకాలకు నోచుకోక వందల సంఖ్యలో వచ్చి చేరాయి. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ వాహనమిత్ర, విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతుండటంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. నిత్యం వందలాది మంది తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తమ దరఖాస్తు ఏమైందంటూ కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నిస్తున్నారు. గత వారం రోజుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో పథకాలకు సమయం ముగిసిపోతుందని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్ దిగుబడులు ఆరంభం

రుద్రవరం: మండలంలో ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన పంటల కాలం పూర్తి కావడంతో కోతలు మొదలయ్యాయి. వచ్చిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు కళ్లాలు, బయలు ప్రదేశాల్లో ఆరబోసుకుంటున్నారు. మండల కేంద్రమైన రుద్రవరం, కోటకొండ, ఎల్లావత్తుల, శ్రీరంగాపురం, అప్పనపల్లె, ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం తతదితర గ్రామాల పరిధిలో మినుములు, మొక్కజొన్నల కోతలు మొదలయ్యాయి.



రుద్రవరం సమీపంలో ఆరబోసిన మినుములు